క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: మండల కేంద్రంలోని కోటవీధి మసీదు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, జిల్లా ఎస్టీ విభాగం కార్యదర్శి సాకే గంగాధర,జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, నాయకులు మల్లూరి వెంకటేశులు , మల్లేష్, వెంకటప్ప, విల్సన్, రాజు, రమేష్, చంద్ర, దాదు, ప్రసాద్, అలీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కళ్యాణదుర్గం రూరల్: వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా మంగళవారం పట్టణంలోని బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ డైరెక్టర్ చల్లా కిషోర్ మాట్లాడుతూ ఈ నెల 24 వరకూ వినియోగదారుల వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కన్స్యూమర్ కేసులు ఆన్‌లైన్‌లో ఫైల్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో వార్డెన్ నాగరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడ్డ మద్యం చూపుతున్న సీఐ జయనాథ్‌రెడ్డి

రాయదుర్గం: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టణానికి చెందిన పాండురంగ అనే వ్యక్తి మంగళవారం పట్టుబడ్డారని సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. నిందితుడి నుంచి 192 కర్ణాటక టెట్రా మద్యం పాకెట్లతో పాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కర్ణాటక మద్యం విక్రయించినా, రవాణా చేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరికృష్ణ, హెడ్‌కానిస్టేబుళ్లు సోమశేఖర్, షఫీ, సిబ్బంది అనిల్, కిరణ్, శివయ్య, ఇమ్రాన్, ప్రతాప్, జ్యోతి పాల్గొన్నారు.

పరామర్శ

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరుకు చెందిన షఫీని బళ్లారి విమ్స్ ఆస్పత్రిలో పలువురు పరామర్శించారు. రాజశేఖర్ అనే యువకుడు వేడినూనెతో దాడి చేయడంతో షఫీ, అతడి కుటుంబ సభ్యులు గాయపడిన విషయం తెలిసిందే. మంగళవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, ఎంపీటీసీలు రామకృష్ణ, మనోహర్‌శెట్టి, నాయకుడు ఆనంద్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి బాధితుడితో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న

బ్రహ్మసముద్రం: మండలంలోని వేపులపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్, ఆర్డీటీ ఆధ్వర్యంలో బాల్య వివాహాలను అరికట్టడంలో భాగంగా బాలికల భద్రతే సామాజిక భద్రత అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. బాలికలకు చిన్న వయసులో వివాహం చేయడం వల్ల ఎన్నో కష్టాలకు దారి తీస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు తప్పనిసరి



పంటను పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్

రాయదుర్గం రూరల్: రబీ సీజన్‌లో బోర్ల కింద పంటలు సాగు చేసిన రైతులు మీ పరిధిలోని ఆర్బీకేల్లో ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏడీఏ లక్ష్మానాయక్ సూచించారు. మండలంలోని 74 ఉడేగోళం రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులు సాగు చేసిన పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి రైతూ ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. అలాగే ఆత్మ పీడీ ఎంసీ మద్దిలేటి 74 ఉడేగోళం రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి భూసార పరీక్ష ఫలితాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఎంఏఓ మహేంద్ర, వీఏఏ సత్యావతి, రైతులు పాల్గొన్నారు.





గుమ్మఘట్ట మండలం రంగచేడులో ఆంజనేయస్వామి రథోత్సవ దృశ్యం, కుందుర్పి మండలం నాగేపల్లిలో యల్లమ్మ రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా రథోత్సవాలు

గుమ్మఘట్ట: మండలంలోని రంగచేడు గ్రామంలో ఆంజనేయస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు కుంకుమార్చన, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి తదితర పూజలు చేపట్టారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించిన రథంలో కొలువుదీర్చి గ్రామంలో డప్పు, మేళతాళాల నడుమ ఊరేగించి మొక్కులు తీర్చుకున్నారు. రథం ముందు మహిళలు కలశాలను ప్రదర్శించగా యువకులు నందికోళ్లతో నాట్యం చేశారు. రథోత్సవాన్ని తిలకించడానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పలు దుకాణాలు వెలిశాయి.

కాపాడు.. యల్లమ్మ తల్లీ

కుందుర్పి: మండలంలోని నాగేపల్లిలో మంగళవారం సాయంత్రం గ్రామ దేవత యల్లమ్మ అమ్మవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ మడుగు రథోత్సవం చేపట్టారు. సాయంత్రం బ్రహ్మ రథోత్సవం నిర్వహించారు. భక్తులు రథంపై అరటిపండ్లు, తమలపాకులు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. వక్కళిగ డైరెక్టర్ సుజాతమ్మ, సర్పంచ్ గోవిందమ్మ, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఆయుర్వేదిక్ వైద్యులు ప్రహల్లాద తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

గుమ్మఘట్ట: ప్రభుత్వ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. మండలంలోని భూపసముద్రంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రను పురస్కరించుకుని గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రాజేష్, సచివాలయ సిబ్బంది , గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు సంఘం కమిటీ ఎంపిక

కూడేరు: సీపీఐ అనుబంధ రైతు సంఘం నియోజకవర్గ నూతన కమిటీ ఎంపిక మంగళవారం కూడేరులో జరిగిన రైతు సంఘం తాలుకా మహాసభలో ఎంపిక చేశారు. కార్యక్రమానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్, ప్రధాన కార్యదర్శులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా సుల్తాన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కురుగుంట మనోహర్, ఉపాధ్యక్షులుగా గోపాల్, రమణ, సహాయ కార్యదర్శులుగా వెంకటేష్, రామాంజనేయులును ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఎండుతున్న పంటలకు హంద్రీ నీవా ద్వారా నీటిని అందించి రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు.

నేడు ప్రభుత్వ విప్ పర్యటన

బొమ్మనహాళ్: మండలంలోని గోనేహాళ్ గ్రామంలో బుధవారం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గోనేహాళ్ గ్రామం నుంచి బేనేకల్లు, బ్రహ్మసముద్రం, కణేకల్లు గ్రామాల వరకూ నిర్మించే తారు రోడ్డు నిర్మాణానికి విప్ భూమి పూజ చేస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రభుత్వ కార్యాలయాల ప్రారంభం

రాయదుర్గం: డి హీరేహాళ్ మండలంలోని మురడిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి బుధవారం ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి మంగళవారం తెలిపారు. అలాగే సోములాపురం వద్ద బళ్లారి- రాయదుర్గం ప్రధాన రహదారి మరమ్మతుకు భూమిపూజ చేస్తారన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలతో పాటు పార్టీ నాయకులు, అధికారులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత



విద్యుత్ ఆదాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం: విద్యుత్ పొదుపు మనందరి బాధ్యత అని ఆ శాఖ ఈఈ శేషాద్రిశేఖర్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యుత్ ఆదాపై ఫ్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ కార్యాలయం నుంచి టీ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈఈ మాట్లాడుతూ అవసరం లేనప్పుడు విధిగా లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేయాలన్నారు. కరెంటు తక్కువ వాడకం వల్ల పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. సహజ వనరులైన బొగ్గు, గ్యాస్, క్రూడ్ ఆయిల్ వంటి ఇంధనాలు కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రజలకు ఇంధన సంరక్షణ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఈ గురురాజ్, ఏఈ వైఎండీ సలీం, సిబ్బంది పాల్గొన్నారు.

కాలవా.. పసలేని ఆరోపణలు మానవా..!



మాట్లాడుతున్న మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్

రాయదుర్గం: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు స్వార్థరాజకీయాల కోసం ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిపై పసలేని ఆరోపణలు చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాడని, ఇది దిగుజారుడు తనానికి నిదర్శనమంటూ రాయదుర్గం మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్ నాయక్ ఆరోపించారు. మంగళవారం డి హీరేహాళ్ మండల కేంద్రంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ తొండె వెంకటేశులు, సర్పంచులు బోయ మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి, రుద్రేష్‌తో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ రాయదుర్గం పట్టణ సమీపాన 74 ఉడేగోళం వద్ద కృష్ణవెంచర్‌లో 19, 20 నంబర్ ప్లాట్లను విప్ కాపు డబ్బు చెల్లించాకే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఇందుకు సంబంధించి రూ.7.32 లక్షల నగదును యజమాని బ్యాంకు ఖాతాకు అప్పట్లోనే జమ చేశారన్నారు. మరికొంత మొత్తం చెక్కుల రూపంగా చెల్లించారన్నారు. వాటి ఆధారాలను విలేకరులకు చూపారు. ఇవేవీ తెలియకుండానే 23 సెంట్ల స్థలం లంచం కింద తీసుకున్నాడని ఇష్టారాజ్యంగా ఎలా మాట్లాడుతావ్..? అంటూ నిలదీశారు. ఈ ఆరోపణలకు కట్టుబడుతూ, నీకు దమ్ము, ధైర్యం, రోషం ఉన్నోడైతే బుధవారం 11 గంటలకు మురడి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రమాణానికి రావాలంటూ సవాల్ చేశారు. లేకపోతే విప్ కాపు రామచంద్రారెడ్డికి క్షమాపణలు చెప్పాలన్నారు. ఊరి చుట్టూ నీ టీడీపీ తొత్తులే వెంచర్లు వేసి, నీకు వాటాలు పంపారని, అలాంటి నీచ సంస్కృతి నీదంటూ దుయ్యబట్టారు. రాయదుర్గంలో గెలిచేది, నిలిచేది వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. 2024లో టీడీపీ ఖేల్‌ఖతం , దుకాణం బంద్ కాబోతుందన్నారు. 2014 లో నీరు-చెట్టు, మట్టి మొదలు ఇతర ప్రకృతి సంపదను కొల్లగొట్టింది ఎవరో ప్రజలు నేటికీ మరచిపోలేదన్నారు. రేషన్‌కార్డు నుంచి ఆఖరకు మరుగుదొడ్ల వరకూ లంచాలు దిగమింగిన నీచ బతుకులు పచ్చ నాయకులదన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న సెబ్ సీఐ మారుతీరావు

ఉరవకొండ: పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఉరవకొండ సెబ్ సీఐ మారుతిరావు, జిల్లా బాలల సంక్షరణ అధికారి వెంకటేశ్వరి సూచించారు. మంగళవారం స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోమత్తుపదార్థాలు తీసుకోవడం వల్ల శరీరంపై చెడు ప్రభావం పడుతుందన్నారు. మత్తుకు బానిసై మిత్రులతో కలవకుండా ఇంట్లో ఒంటరిగా గడపడం అలవాటవుతుందన్నారు. దీంతో జీవితం నాశనమవుతుందన్నారు. అలాగే బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, డయల్ 1098 సిబ్బంది సుభాహసిని, వెంకట్‌కుమార్ తదితరులలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు



యర్రగుంటలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కణేకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీతో పాటు జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, పార్టీ నాయకుడు కెనిగుంట రామిరెడ్డి గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డునుఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. ఈసందర్భంగా ఏర్పాటైన సభలో వారు మాట్లాడుతూ అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, రైతుభరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, జగనన్న చేదోడు తదితర పథకాలు కొనసాగాలంటే 2024 ఎన్నికల్లో జగనన్నను మరోసారి సీఎం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొని శ్రీనివాసరెడ్డి, అశోక్, ఈరన్న, భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు మాలధారులు



పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం



మాలధారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని ఎల్‌బీనగర్ గ్రామంలో అయ్యప్ప మాలధారులు ఇరుముడులను సమర్పించేందుకు మంగళవారం శబరిమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామంలోని సీతారామస్వామి ఆలయంలో అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడు, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్పస్వామి చిత్రపటాలతో పాటు పది మెట్లను ప్రత్యేకంగా అలకరించి విశేష పూజలు గావించారు. ఈసందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం మాలధారులు ఇరుముడులతో శబరిమలకు బయలుదేరారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

ఉరవకొండ: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మాలధారులకు దాతలు అన్నదానం నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. దాతలు హేమాంజలి, సుదర్శన్, చిరంజీవి, సాయిసహస్త ఆధ్వర్యంలో వందలాది మంది భకులకు అన్నదానం చేశారు. అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో పడిపూజ, భజన లో నిర్వహించారు.

ప్రారంభానికి సిద్ధం



ట్రాన్స్‌కో కార్యాలయ నూతన భవనం

కూడేరు: స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ట్రాన్స్ కో కార్యాలయ భవనం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న కార్యాలయ భవనం పైకప్పు దెబ్బతిని సిమెంట్ పెచ్చులూడి కింద పడేవి. వర్షానికి గదుల్లోకి నీరు దిగేది. ఇబ్బంది పడుతూనే సిబ్బంది, విధులు నిర్వర్తించేవారు. పని నిమిత్తం వచ్చే ప్రజలు, రైతులు సైతం అవస్థలు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి ఆ శాఖ నిధుల కింద రూ.26 లక్షలు మంజూరు చేసింది. నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. వచ్చే నెలలో భవనాన్ని ప్రారంభించనున్నట్లు ఏఈ గౌస్ వెల్లడించారు. నూతన భవనం ప్రారంభమైతే సిబ్బందికి ఇబ్బందులు తొలగుతాయి.

సెల్‌ఫోన్ మరమ్మతుపై శిక్షణ

కళ్యాణదుర్గం: ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో సెల్‌ఫోన్ రిపేరీ సర్వీస్ టెక్నీషియన్ కోర్సుపై నైపుణ్య శిక్షణ కల్పించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సెల్‌ఫోన్ రిపేరీతో పాటు కస్టమర్లతో ఎలా వ్యవహరించాలి, ఇంగ్లిష్ నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఉంటుందన్నారు. 45 రోజుల పాటు కోర్సు వ్యవధి ఉంటుందని, 18-40 మధ్య వయస్సు ఉండి, ఏడో తరగతి నుంచి ఇంటర్ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. అభ్యర్థులకు శిక్షణ కాలంలో మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌తో పాటు టూల్ కిట్ అందజేస్తామన్నారు. వివరాలకు కళ్యాణదుర్గంలోని పాత ఆర్డీటీ కార్యాలయంలోని ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ లేదా 9440433919, 9959422884, 7780752418 నంబర్లను సంప్రదించాలన్నారు.

మోపిడిలో వైద్య బృందం పర్యటన

ఉరవకొండ: మండలంలోని మోపిడిలో వైద్య బృందంతో పాటు మలేరియా సబ్ యూనిట్ అధికారులు మంగళవారం పర్యటించారు. రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన బోయ మణికంఠ కుటుంబాన్ని వారు విచారణ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారి వెంకటేష్ నాయక్, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి మాట్లాడుతూ మణికంఠ అనే చిన్నారి జ్వరంతో చనిపోలేదన్నారు. గ్రామంలో చురుగ్గా ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టామన్నారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 34 మంది చిన్నారులకు చికిత్స చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్దార్థ, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, మండల విస్తరణ అధికారి నాగరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

'దుర్గం'లో ట్రాఫిక్ పద్మవ్యూహం



వినాయక సర్కిల్‌లో ట్రాఫిక్ కష్టాలు..

- రోడ్డుపైనే గంటల తరబడి ప్రైవేటు బస్సులు
- అక్రమ పార్కింగ్‌లతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు

రాయదుర్గం: పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు ప్రజలను వెంటాడుతున్నాయి. ప్రధాన కూడలి వినాయసర్కిల్ మీదుగా ఉత్తరం వైపు బళ్లారి, దక్షిణం వైపు బెంగళూరు ప్రాంతాలకు వెళ్లే బస్సులు నిత్యం రద్దీగా ఉంటాయి. ఈ ప్రధాన రహదారుల్లోనే ప్రైవేటు బస్సులు నిలిపి రవాణా కార్యకలాపాలు సాగిస్తున్నారు. రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లోనే యూ టర్న్ చేస్తూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగజేస్తున్నారు. ఓ వైపు దారిలో బస్సులు ఆపి ప్రయాణికులను ఎక్కిస్తే, మరో వైపు దారిలో ప్రయాణికులను దింపుతుంటారు. వారిని పికప్ చేసుకునే క్రమంలో ఆటోలు రెండు వైపులా బారులు దీరుతాయి. పొరపాటున అటువైపు వెళ్లిన వారు ట్రాఫిక్ పద్మవ్యూహంలో ఇరుక్కోక తప్పదు. బళ్లారి రోడ్డులో సైతం ప్రధాన రహదారిపై అడ్డంగానే ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు నిలిపి ఉంటారు. ఈ నేపథ్యంలో వాహన దారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణంలో జనాభాపెరగడం, దానికి తగ్గట్టుగా వాహనాల సంఖ్య ఎక్కువ కావడం, గ్రామాల నుంచి వచ్చే వాహనాలు ఈ సర్కిల్ మీదే రాకపోకలు సాగించడం లాంటి కారణాలు వెరసి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది.

సిగ్నల్స్ లేకపోవడంతో..

వినాయక సర్కిల్ మీదుగా తూర్పుకెళ్లితే అనంతపురం, ఉత్తరం వైపు బళ్లారి, దక్షిణం వైపు చిత్రదుర్గం, బెంగళూరు లాంటి మహానగరాలు అనుసందానం చేసే ఈ ప్రధాన కూడలిలో సిగ్నల్ ఏర్పాటు చేయలేదు. ఈ కారణంగా వచ్చిన వాహనాలు వచ్చినట్టే ఎదురెదురుగా ఇరుక్కుపోతున్నాయి. దీంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. పట్టణంలో ఆర్టీసీ, ప్రైవేటు బస్టాండులు ఉన్నాయి. ఇక్కడి నుంచే రవాణా కార్యకలాపాలు సాగిస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. బస్సులను రోడ్లపై నిలపకుండా పోలీసులు, ఆర్టీఓ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పట్టణంలోకి వచ్చే టెన్‌వీలర్ లారీలు, గూడ్స్‌లు, టిప్పర్లను బైపాస్‌పై మళ్లించాలని వాహనదారులు కోరారు. కూరగాయలు, మటన్, చికెన్ మార్కెట్లున్న ఓబుళాచారి రోడ్డు, దానప్ప రోడ్లలో ట్రాఫిక్‌పై పోలీసులు దృష్టి సారించాలన్నారు. రోడ్లపై ఇష్టారాజ్యంగా వెలుస్తున్న తోపుడు బండ్లు, ఇతర దుకాణాల దారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు కృషి



పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై పటిష్ట చర్యలు చేపడతాం. రోడ్డుపై బస్సులు నిలిపితే కేసులు నమోదు చేయిస్తాం. టెన్ వీలర్ లారీలు పట్టణం మీదుగా కాకుండా బైపాస్‌లో మాత్రమే వెళ్లేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. పట్టణంలో అందుబాటులో ఉండే ఎంవీఐ, పోలీస్ సిబ్బంది కలసి సంయుక్తంగా ట్రాఫిక్ కష్టాలు తీర్చేలా కృషి చేస్తాం.

– బీ శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం



మేదరవీధిలో నిత్యం ఇలా..



రోడ్డుపైనే ప్రైవేటు బస్సును నిలిపిన దృశ్యం

ఫర్టిలైజర్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

ఉరవకొండ: పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను విజిలెన్స్ సీఐ వెంకటరమణ, ఏఓ వాసుప్రకాష్, కానిస్టేబుల్ మనోహర్‌రెడ్డి, ఉరవకొండ మండల ఏఓ శుభకర్ మంగళవారం తనిఖీ చేశారు. అయ్యన్ ఫర్టిలైజర్ షాపులో రూ. లక్ష విలువ చేసే ఎరువుల అమ్మకాలు నిలిపివేశారు. రూ.90వేలు విలువ చేసే 6.3 మెట్రిక్ టన్నుల ఎరువులను జప్తు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

బెళుగుప్ప: మండలంలోని నరసాపురం గేట్ వద్ద జాతీయ రహదారి పక్కనే నివాసముంటున్న శంకర్‌గౌడ్ ఇంట్లో చోరీ జరిగింది. సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో కలసి ఇంటికి తాళం వేసి నరసాపురం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయాన్ని ఇంటికి చేరుకుని చూడగా తలుపులు తీసి ఉన్నాయి. దీంతో లోపలకు వెళ్లి పరిశీలిస్తే బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ శివ పరిశీలించారు. ఒకటిన్నర తులం బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు అపహరించుకెళ్లినట్లుగా బాధితుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.